క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు



పొన్నూరు: ప్రైవేటు బస్సు డివైడర్‌ను ఢీకొని ప్రయాణికులకు గాయాలైన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం చీరాల నుంచి హైదరాబాదు వెళుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అతి వేగం కారణంగా అదుపు తప్పి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బస్సుకు టైరు ఊడిపోవడంతో ప్రయాణికులు వేరే బస్సుల ద్వారా తమ గమ్య స్థానాలకు చేరుకున్నారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు



పెదకాకాని: రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు గుంటూరు జిల్లా జట్టు సిద్ధంగా ఉందని వ్యాయామోపాధ్యాయుడు వినయ్‌కుమార్ తెలపారు. ఈ నెల 23వ తేదీ నుంచి 25 వరకు మూడు రోజుల పాటు తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో 14 సంవత్సరాల లోపు బాలికల జట్టును అధికారులు ఎంపిక చేయడం జరిగింది. ఈ నెల 21వ తేదీన జరిగిన ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలికల జట్టును 20 మందితో ఎంపిక చేశారు. జట్టులో ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 16 మంది, యనమదల జెడ్పీహెచ్ స్కూల్ నుంచి ముగ్గురు, గుంటూరు లిటిల్ ఫ్లవర్ స్కూల్ నుంచి ఒకరు ఎంపికయ్యారని పీఈటీ వినయ్‌కుమార్ తెలిపారు.

లోకానికి వేదాలను అందించిన వ్యాసభగవానుడు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏడు కోట్ల మంత్రాలను నాలుగు వేదాలుగా విభజించిన వ్యాస భగవానుడు వేదవ్యాసునిగా అవతరించారని టీజేపీఎస్ కళాశాల విశ్రాంత తెలుగు ఆచార్యులు డాక్టర్ జి.వైదేహి అన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం సంస్కృత విభాగ ఆధ్వర్యంలో వ్యాస పూర్ణిమ నిర్వహించారు. వైదేహి మాట్లాడుతూ కాలం గడిచే కొద్దీ మానవుని బుద్ధి శక్తి క్షీణిస్తోందని, అందుకు అనుగుణంగానే బ్రహ్మసూత్రాలు, అష్టాదశ పురాణాలను రచించి వేదసారాన్ని మహా భారతంగా అందించాడని పేర్కొన్నారు. టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ ఆషాఢమాసంలో వచ్చే గురు పూర్ణిమను వ్యాసపూర్ణిమ అని పిలుస్తారని, లోకానికి జ్ఞానభిక్ష పెట్టిన వ్యాసుడు జన్మించిన రోజు అని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్ర గుప్తా, డాక్టర్ ఎ.అంజనీ కుమార్, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

అంజుమన్-ఇ-ఇస్లామియా కమిటీ ఎన్నికలు నిర్వహించాలి

లక్ష్మీపురం: గుంటూరు అంజుమన్-ఇ-ఇస్లామియా వక్ఫ్ సంస్థకు సంబంధించి బై లా ప్రకారం ఎన్నికలు నిర్వహించకుండా శాసన సభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డు మేనేజ్‌మెంట్ కమిటీలను ఎంపిక చేస్తున్నారని రాష్ట్ర ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి సంఘ అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి లేఖ రాశారు. గతంలో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన బైలాస్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, వక్ఫ్ బోర్డు సీఈఓ, జిల్లా కలెక్టర్‌కు కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కానీ ఇంత వరకు వాటిని సంబంధింత అధికారులు అమలు చేయలేదని ఆరోపించారు. అంజుమన్-ఇ-ఇస్లామియా సంస్థలో ఎన్నికలు నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తికి లేఖ రాసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

రక్తదానం చేసిన యువకుడు

మంగళగిరి: ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి ఓ యువకుడు రక్తదానం చేశాడు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యర్రబాలేనికి చెందిన వృద్ధురాలు పాశం లక్ష్మమ్మ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్యంతో కొద్ది కాలంగా చికిత్స పొందుతోంది. ఆమెకు శస్త్ర చికిత్స నిమిత్తం.. రక్తం అవసరమని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న శాలివాహన పేటకు చెందిన యువకుడు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని రక్తదానం చేశాడు. వృద్ధురాలు కుటుంబసభ్యులు, వైద్యులు యువకుడిని అభినందించారు.

ప్రారంభమైన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు

- తొలిరోజు మమ అనిపించిన ఉపాధ్యాయులు
- మొక్కుబడిగా పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు

ప్రత్తిపాడు: శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను ఉపాధ్యాయులు మమ అనిపిస్తున్నారు. మొక్కుబడిగా నిర్ణీత షెడ్యూల్‌ను అమలు చేస్తున్నారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు రోజుకొక అంశంపై శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంది. అందులో భాగంగా తొలిరోజు ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో బోధనాభ్యసన సామగ్రిని రూపొందించి ప్రదర్శించాల్సి ఉంది. వీటిని తిలకించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. అయితే మొదటి రోజే కార్యక్రమాన్ని మమ అనిపించేశారు. మండలంలో మొత్తం 45కుపైగా పాఠశాలలు ఉండగా వీటిలో సగానికి పైగా స్కూళ్లలో బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శించిన దాఖలాలు



ప్రత్తిపాడు ఎల్ఈ పాఠశాలలో జాడలేని శిక్షా సప్తాహ్ ప్రదర్శనలు



ప్రత్తిపాడు హెచ్ఈ మెయిన్ పాఠశాలలో పత్తాలేని శిక్షా సప్తాహ్ ప్రదర్శనలు

లేవు. కొన్ని పాఠశాలల్లో మొక్కుబడిగా జరిపినప్పటికీ తల్లిదండ్రులను ఆహ్వానించిన జాడ కనిపించలేదు. ఏదో ఉన్నతాధికారులు చెయ్యమన్నారు కాబట్టి చేశామన్న రీతిలో నాలుగు బోర్డులు ప్రదర్శించి పని ముగించేశారు. కార్యక్రమ పర్యవేక్షణకు



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో మొక్కుబడిగా తరగతి గదుల్లో నిర్వహిస్తున్న అభ్యసన సామగ్రి ప్రదర్శన

ప్రత్యేకాధికారిగా నియమించిన ఏపీసీ నడింపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తారన్న ప్రచారం జరగడంతో ఆ పాఠశాలలో మాత్రం కాస్తంత మెరుగ్గా ప్రదర్శన చేపట్టినప్పటికీ ఏపీవో గైర్హాజరయ్యారు. ఇక ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అయితే తరగతుల వారీగా అభ్యసన ప్రదర్శనలు చేశామంటూ చెప్పగా, ప్రత్తిపాడు ఎల్ఈ, హెచ్ఈ పాఠశాలల్లో మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రదర్శనలే చెయ్యలేదు. ఆయా విషయాలపై ఏపీసీని వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో ప్రయత్నించినప్పటికీ అందుబాటులోకి రాలేదు. కాగా ప్రత్తిపాడు ఎంఈవో సీహెచ్ రమాదేవి మాత్రం అన్ని పాఠశాలలకు శిక్షా సప్తాహ్ నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలిచ్చామని, అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చెత్త కుప్పల తొలగింపు



తహసీల్దార్ కార్యాలయం ముందు వ్యర్థాల కుప్పలు తొలగించి చల్లిన బ్లీచింగ్



పోలిస్ స్టేషను పక్కన చెత్తకుప్పలను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను ఎట్టకేలకు పంచాయతీ అధికారులు తొలగించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణిస్తుందని, ఎక్కడ పడితే అక్కడే వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయని, వరుసగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు కాపు కాస్తున్నాయంటూ ఈ నెల 21వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'వ్యర్థాల కుప్పలు.. వ్యాధుల వెతలు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఖాజా గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను పారిశుద్ధ్య కార్మికులతో తీసివేయించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురునున్న వ్యర్థాల కుప్పలతో పాటు



గొట్టిపాడులో వ్యర్థాల కుప్పలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పోలిస్ స్టేషన్, గొట్టిపాడు రోడ్డులో ఉన్న కుప్పలను తీయించి, శుభ్రం చేయించారు. వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించారు.

చలపతి ఫార్మసీలో విద్య వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు రూరల్: విద్య వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని ఆలోచనా శక్తిని, నైపుణ్యతలను వెలికి తీయవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఆగస్టు 2, 3 తేదీల్లో నిర్వహించనున్న విద్య వైజ్ఞానిక ప్రదర్శన బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ లాం నందున్న కళాశాలలో 17వ ఫార్మసీ విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు రోజులపాటు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ ఏడాది నుంచి మోతడక గ్రామంలోని చలపతి విద్యాసంస్థల ప్రాంగణంలో మరో చలపతి ఫార్మసీ కళాశాలను ప్రారంభించటం జరిగిందన్నారు. ఈ ఫార్మ్ ఎక్స్‌పో రెండు కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఔషధాల తయారీ నుంచి ఔషధం తీసుకున్న తరు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చలపతి విద్యాసంస్థల అధినేత ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు

వాత శరీరం నుంచి ఎలా బయటకు వెలువడుతుందో కనుగొనుటకు ఉపయోగించే అన్ని రకాల నూతన పరికరాలు, వాటి పనితీరు ప్రదర్శనలో ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తదితరులున్నారు.

దేశంలో మతోన్మాదాన్ని పెంచేందుకే బీజేపీ ఎత్తుగడ

కాంగ్రెస్ నేత జక్కా రవీంద్రనాథ్

పొన్నూరు: బీజేపీ దేశంలో మతోన్మాదాన్ని పెంపొందిస్తుందని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కా రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వోద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా విధించిన నిషేధాన్ని రద్దు చేస్తూ తీసుకువచ్చిన నూతన ఆర్డర్ మెమొరాండంను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో సైన్స్, టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన, నాణ్యమైన వైద్యం వంటి అంశాలపై చర్చలు జరిగేవని, ప్రభుత్వం కూడా అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించేదని పేర్కొన్నారు. గత పదేళ్లుగా బీజేపీ పాలనలో దేశ ప్రజల మధ్య విద్వేషాన్ని పెంపొందించి దేశ సమగ్రతకు, అంతర్గత భద్రతకు విఘాతం కలిగించే మతంపై చర్చలు జరుగుతున్నాయని విమర్శించారు. నిషేధిత మతోన్మాద సంస్థ ఆర్ఎస్ఎస్‌ను 60 ఏళ్లుగా కాంగ్రెస్ నిలువరించిందని, కానీ నేడు బీజేపీ ఆర్ఎస్ఎస్ సంస్థపై నిషేధాన్ని తొలగించటమే కాకుండా ఆ సంస్థ శాఖా సమావేశాలకు, శిక్షణలకు ప్రభుత్వోద్యోగులకు అనుమతిని ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. దేశాన్ని పాకిస్తాన్ మాదిరి మతపరమైన రాజ్యంగా చేయాలనే తలంపుతో ఉన్న మోదీ ప్రధానిగా అనర్హుడని, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని భారత రాజ్యాంగ స్థానంలో తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్న మోదీ ఆటలు ఇంకొన్నాళ్లు సాగితే దేశం మతం పేరిట అల్లకల్లోలమై సర్వనాశనం అవుతుందని వెల్లడించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ ఎంతకైనా తెగిస్తుందని, మోదీని నిలువరించే నాయకుడు రాహుల్ మాత్రమేనని అన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

పెదకాకాని: పార్కింగ్ ప్రదేశంలో పెట్టిన బైక్ మాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. కృష్ణా జిల్లా, నున్న సమీపంలోని పాతపాడు గ్రామానికి చెందిన బి.రామకృష్ణ, శివకేశికబాయి దంపతులు సోమవారం పెదకాకాని ఏసుప్రభు తోటలో జరిగే ప్రార్థనలకు వచ్చారు. ఉదయం 12 గంటలకు వచ్చిన వారు తోట బయట పార్కింగ్ ప్రదేశంలో బైక్ పెట్టి తాళాలు వేసుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రార్థన ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు బైక్ వద్దకు వచ్చి చూస్తే కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో బైక్ చోరీకి గురైనట్లు భావించి పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదే ప్రదేశంలో పలువురి బైక్‌లు చోరీకి గురి కావడంతో వారికి డబ్బులు చెల్లించలేక స్టాండ్ నిర్వాహకులు ముందుకు రావడం లేదు. దీంతో బైక్‌లను ఒక ప్లాన్ ప్రకారం చోరీ చేస్తున్నారు. ఆరు నెలల్లో ఇప్పటికి మూడు బైక్‌లు మాయం కావడం విశేషం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన చట్టు శివరామకృష్ణ (ఫైల్)

ప్రత్తిపాడు: వాహనం నడుపుతూ ప్రమాదవశాత్తూ జారి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన చట్టు శివరామకృష్ణ (36) గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదలలోని పదహారవ నంబరు జాతీయ రహదారి పక్కనున్న పెట్రోల్ బంకులో పంప్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై మధ్యాహ్నం సమయంలో ఇంటికి బయల్దేరాడు. వర్షం కారణంగా మోటర్‌సైకిల్ స్కిడ్ అవ్వడంతో జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య చట్టు దుర్గా చందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డితోట 3వలైనులో నివాసం ఉండే సీరంశెట్టి దుర్గాప్రసాద్(35) అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో సోమవారం ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోధన అభ్యసన సామగ్రి ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభించిన శిక్షా సప్తాహ్‌లో భాగంగా చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రిని ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ స్థానికంగా దొరికే లోకాస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రి ఎంతో ఆకర్షణంగా ఉందన్నారు. విద్యార్థులందరూ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బోధన అభ్యసన సామగ్రిని తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలోని రోజువారీ కార్యక్రమాలను వారం రోజులపాటు నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలిప్పించాలి

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ చిన్నప్ప

ప్రత్తిపాడు: కౌలు రైతులందరికీ కౌలు రైతు కార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలు ఇప్పించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు, చట్టాలపై రైతులకు, భూ యజమానులకు సోమవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ప్రత్తిపాడు ఏరియా కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల, ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నంలు తూర్పు పాలెం, కొండేపాడు, కోయవారిపాలెం, ప్రత్తిపాడు ఆటో ద్వారా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నప్ప మాట్లాడుతూ సాగుదారు కార్డు పొందిన వారికి ఆ భూమిపై ఎటువంటి హక్కులు రావని, కేవలం పంట రుణాలు, బీమా, సబ్సిడీ వంటి



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న డీబీఆర్‌సీ నాయకులు చిన్నప్ప, నిర్మల

ప్రభుత్వ పథకాలు పొందటానికి మాత్రమే ఉపయోగపడుతుందని వివరించారు. కార్డుపై సాగుదారు బ్యాంకు నుంచి పంట రుణాలు తీసుకుంటే, తిరిగి చెల్లించే బాధ్యత కౌలు రైతుపైనే ఉంటుందన్నారు. అందుచేత భూ యజమానులు ఎలాంటి సంకోచం లేకుండా, సాగుదారులకు సాగుదారు కార్డు పొందటానికి సహకారం అందించాలన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్యులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆరోగ్య భద్రతపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలని సెయింట్ ఆన్స్ బీఎస్సీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లీనా తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో విద్యార్థులకు, అధ్యాపకులకు ఉచిత కంటి, దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్లు ప్రధానమైనవని వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. అదే విధంగా దంతాల రక్షణ ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆపిల్ దంత వైద్యశాల డాక్టర్ తోట హను, డాక్టర్ అంజుమ్, మాక్సీ విజన్ ఆసుపత్రి డాక్టర్ రామలింగారెడ్డిలు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో తాగునీటి నిర్వహణపై సెమినార్

గుంటూరు రూరల్: భవిష్యత్తులో నీటి కొరత వల్ల సంభవించనున్న పలు ప్రమాదాల నివారణకు నదీ జలాల నీటి సమర్థ సద్వినియోగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల తోడ్పాటుకు ఇంజనీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్య ప్రతిభను అందించాలని తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ వింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ఈక్విటీ అన్వేయిలింగ్ ది టెక్నలాజికల్ మార్వెల్స్ ఆఫ్ మిషన్ భగీరథ సస్టైనబుల్ డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నదీ జలాల ద్వారా సరఫరా అయ్యే నీటిని వివిధ పద్ధతుల్లో నిల్వ చేసే విధానాన్ని, ప్రతి ఇంటికి తాగు నీరు, పంట పొలాలకు సాగు నీరు అందించే దశల్లో జరిగే వివిధ పద్ధతులను తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన మిషన్ భగీరథ ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణలో జరిగే వివిధ ప్రక్రియలను ఆయన విద్యార్థులకు వివరించారు. నీటి కొరతను అధిగమించే దిశగా సమర్థవంతమైన నీటి నిర్వహణ వ్యవస్థ ఏర్పాటుకు సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న రీతిలో రూపకల్పన చేయాలని సూచించారు. సర్వ ప్రాణికి జలమే జీవనాధారమని, వినూత్న మార్గ అన్వేషణ ద్వారా నీటి కొరత సమ



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ వింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్

స్యలను పరిష్కరించడంలో సివిల్ ఇంజనీర్లు కీలక పాత్ర పోషించాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాఖలో కీలక పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ పురస్కారాలు అందుకున్న శ్రీనివాస్ తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం ఆనందంగా ఉందని సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మంచి అవకాశాలున్నాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. అతిథిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.శ్రీనివాసప్రసాద్, డాక్టర్ కె.స్వర్ణశ్రీ తదితరులు ఘనంగా సన్మానించారు.

సహాయం చేస్తే.. సెల్‌ఫోన్ మాయం

పెదకాకాని: కింద పడిన వ్యక్తిని చూసి జాలి తలిస్తే సెల్‌ఫోన్ మాయం అయిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రిలో వైద్యం కోసం సోమవారం బాపట్ల జిల్లా పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన కారుమంచి అనిల్‌బాబు వచ్చాడు. ఆసుపత్రి వద్ద రోడ్డు పక్కనే హటాత్తుగా ఒక వ్యక్తి రోడ్డుపై పడి కొట్టుకుంటూ నోటి వెంట నురగలా వస్తుంది. అది చూసిన స్థానికులు అయ్యో పాపం అంటూ అతన్ని కాపాడేందుకు పరుగులు తీశారు. కింద పడిన వ్యక్తి వద్దకు వెళ్లి సపర్యలు చేసి అతన్ని పైకి లేపి పంపించారు. ఆ తరువాత చూసుకుంటే సపర్యలు చేసిన వారిలో అనిల్‌బాబు జేబులో ఫోన్ మాయం అయింది. దీనిపై బాధితుడు పెదకాకాని పోలీసులను ఆశ్రయించాడు. గతంలో కూడా ఒకేరోజు పెదకాకానిలో రెండు ప్రదేశాల్లో ఇదే తరహాలో ఇరువురి జేబుల్లోని ఫోన్‌లు మాయం అయ్యాయి.

చోరీలు ఇలా...

వాస్తవానికి బైక్‌పై ఇద్దరు కానీ ముగ్గురు కానీ జన సంచారం ఉన్న ప్రదేశానికి చేరుకుంటారు. వారిలో ఒకరు సడన్‌గా జనం దగ్గరకు వెళ్లి బైక్‌పై నుంచి కింద పడటం జరుగుతుంది. అతని వెంట వచ్చిన వారు గుమికూడిన జనం మధ్యలోకి చొరబడి వారు కూడా సహాయం చేస్తున్నట్లు నటించి ఒకటి రెండు ఫోన్‌లు మాయం చేస్తారు. ఆ తరువాత బైక్‌పై నుంచి కింద పడిన వ్యక్తి ఫోన్ చోరీ చేసిన వ్యక్తి ఇద్దరూ కలసి వెళ్లిపోవడం జరుగుతుంది. ఈ చోరీల వెనుక పెద్ద రాకెట్ ముఠా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం చేయాలి

లక్ష్మీపురం: రాబోయే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం చేయాలని, రాజధానికి పోలవరానికి నిధులు కేటాయించాలని, ప్రత్యేక హోదాపై సానుకూలంగా స్పందించాలని రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం కేంద్ర బడ్జెట్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంత కాలంగా ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం పూర్తి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించిందని, ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితులలో పదేళ్ల విభజిత ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లుకురిపిస్తారనే ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఇంత కాలం విభజన చట్టంలో భాగంగా ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం తదితరాలకు కేంద్రమే బాధ్యత వహించాలన్నారు. పోలవరం ముంపు ప్రాంతాలకు పునరావస ప్యాకేజీ ఇవ్వలేదని, రైల్వే ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపారని అన్ని బడ్జెట్‌లలోనూ విసిరేసినట్లుగా రాష్ట్రానికి కేంద్రం నిధులు కేటాయించిందన్నారు.

• నమ్మాలి మరి.. మురుగు కాలువే..!



ఇక్కడ కనిపిస్తున్న ఈ పచ్చదనాన్ని చూసి ఇదేదో పచ్చని మైదానమో.. లేక వనమో అనుకుంటే పొరబడినట్లే. అవును ఇది అక్షరాలా మురుగు కాలువే. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వలన ఇలా మురుగు కాలువల్లో పచ్చగడ్డి విపరీతంగా పెరిగి మురుగు ముందుకు పారడానికి వీల్లేని పరిస్థితి నెలకొంది. ఇదెక్కడో మారుమూలనో లేక జనావాసం లేని ఆవాస ప్రాంతమో అనుకుంటే తప్పులో కాలేసినట్లే. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డు వెంబడి నిత్యం వందల మంది ప్రజలు, విద్యార్థులు తిరిగే తహసీల్దార్ కార్యాలయం ఎదురు మురుగు కాలువ దుస్థితి ఇది. ఇదే మార్గంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ఆరోగ్య ఉప కేంద్రం, రైతు సేవా కేంద్రం, బాలికల వసతి గృహాలకు వెళ్లాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం ఈ కాలువలో మురుగు ముందుకు పారే విధంగా చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంతంలో దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకుంటారేమో వేచి చూడాలి.

– ప్రత్తిపాడు